# ఒక అమ్మా నాన్న

"ఏమండీ... ఎడంచెయ్యి బాగా తిమ్మిరిగా, నొప్పిగా ఉందండీ..."

ఏవేవో ఆలోచనలలో తేలియాడుతున్న రామయ్య ఉలిక్కిపడ్డాడు.


"అవునే మరి... వయసుకి మించిన శ్రమ చేస్తే అదే అవుతుందిమరి... నొప్పిమాత్ర వేసుకున్నావా?"

"వేసుకున్నానండీ..."

"ఎందుకే అంత శ్రమపడి అరిసెలు, మైసూర్‌పాక్ చేసావు...?"

"శ్రమేముందండి... మన రవికి అవి చాలా ఇష్టం... నాకెంతో సంబరంగా ఉందండీ... మన బాబుని, కోడల్ని... అదీకాక చిన్నారి అనూషని

బుద్ధిరాజు లక్ష్మీనరసింహారావు



చూస్తాం కదండీ... అబ్బ... అయిదేళ్లయింది కదండీ వాళ్లనిచూసి... నాకైతే సంతోషంతో గుండె ఆగిపోతుందనిపిస్తోంది."

"సరేలే... మరి మాట్లాడకు... హాయిగా ఏమీ ఆలోచించకుండా పడుకో... నొప్పి తగ్గుతుంది..." రామయ్య ప్రక్కనున్న కళ్లద్దాలుతీసి పెట్టుకుని దూరంగా గోడకున్న గడియారంలో టైమ్ చూసాడు. అర్ధరాత్రి పన్నెండు దాటింది. మంచం దగ్గరే ఉన్న చెంబులోని మంచినీరు త్రాగి కళ్లద్దాలు తీసి పక్కనపెట్టి పడుకున్నాడు.

ఎంత వద్దనుకున్నా ఆలోచనలు సుడిగుండంలా మనసులో తిరుగుతున్నాయి.

అతను గవర్నమెంట్ స్కూల్‌లో బంట్రోతుగా ఉద్యోగంలో జాయినయి, అలాగే రిటైర్ అయిపోయాడు. ఎలాగో బ్యాంక్ లోన్ తీసుకుని విద్యానగర్‌లో రెండుగదుల ఇల్లు కొన్నాడు. ఇప్పుడు అతని వయసు అరవై తొమ్మిది. భార్య జానకి అతనికంటే ఒక సంవత్సరం చిన్నది.

అతి తక్కువ జీతంలోనే ఇల్లుగడుపుతూ ఒక్కగానొక్క కొడుకు రవిని బాగా చదివించాడు. అతను ఎంతగానో చదువుకుందామనుకున్నాడు కానీ, వాళ్ల నాన్నకు ఆర్థికస్తోమత లేక చదువుకోలేకపోయాడు. వాళ్లది పెద్దకుటుంబమే అయినా తండ్రి చనిపోగానే ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు. అతను స్కూల్‌లో బంట్రోతు ఉద్యోగంలో జాయిన్ అయిపోయాడు. అందుచేత రవిని అల్లారుముద్దుగా పెంచి, బాగా చదివించాడు.



ఇంజనీరింగ్‌తో పాటు ఎం.బి.ఏ. కూడా మంచి ర్యాంక్ వచ్చేలా ప్రోత్సహించారు... అవకాశం, అదృష్టం రవికి కలిసివచ్చాయి. మంచి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అయితే వాళ్లు వెంటనే అమెరికాలో పోస్టింగ్ ఇచ్చారు. రామయ్యకి, జానకికీ ఇష్టంలేకపోయినా రవి సంతోష సాగరంలో తేలియాడడం చూసి మనసు నిబ్బరపరచుకున్నారు.

రవి అమెరికాలో జాయిన్ అయిన రెండు నెలలకే ప్రమోషన్ వచ్చి హోదా పెరిగింది. మంచిజీతం, కారు, బంగ్లా అన్ని సదుపాయాలూ పొందాడు. అప్పుడప్పుడూ రవి హైదరాబాద్ ఆఫీస్‌కి ఫోన్‌చేసి విశేషాలు చెప్పేవాడు. లేదా ఏదో సమయానికి వారిని ఆఫీసుకు రమ్మని ఫోన్లో మాట్లాడేవాడు. నెలనెలా తండ్రి బ్యాంక్ ఎకౌంట్‌కి పదివేలు ట్రాన్స్‌ఫర్ చేసేవాడు.

సంవత్సరం దాటింది. రవి, వాళ్ల ఆఫీసులో ఆఫీసర్‌గా ఉన్న ఓ తెలుగు అమ్మాయి ప్రేమించుకున్నారు. ఒక శుభ ముహూర్తాన హైదరాబాద్‌లోనే ఘనంగా వారి వివాహం జరిగింది. ఆ తర్వాత రెండువారాలు రవి, భార్యా తల్లీ తండ్రుల దగ్గర ఉండి అమెరికా వెళ్లిపోయారు. సంవత్సరంలోపునే వారికి ఓ పాప పుట్టింది. పాపకి అనూష అని పేరుపెట్టారు. పాప అన్నప్రాసనకి హైదరాబాద్ వచ్చి కార్యక్రమం అయిన వారంలోపే తిరిగి వెళ్లిపోయారు. మామ్మ

కన్నీరుతో, తాత భారమైన మనసుతో ఆ అమెరికా వాస్తవ్యులకి వీడ్కోలు చెప్పారు... అంతే! ఆ తర్వాత వాళ్లు రాలేదు.

మూడురోజుల క్రితం హైదరాబాద్ ఆఫీసులో ఉన్న రవి మిత్రుడువచ్చి రవి ఫ్యామిలితోపాటు వస్తున్నాడని చెప్పాడు. అప్పటినుంచి రామయ్య లోలోన సంబరపడుతూంటే... జానకికి సంబరాల పండుగలా అనిపించింది.

"ఏమండీ...!" జానకి స్వరం విని రామయ్య ఉలిక్కిపడ్డాడు.

"ఏమైంది జానకీ?"

"టైమ్ ఎంతయిందండీ?"

"చూస్తానుండు..." రామయ్య లేచికూర్చుని కళ్లద్దాలు పెట్టుకుని గడియారం చూసాడు. మసక మసకగా కనిపించింది.

"రెండున్నర అయిందే... ఇంకా పడుకోలేదా?... నొప్పి, తిమ్మెర తగ్గిందా?" ప్రక్క మీద వాలుతూ అడిగాడు రామయ్య.

"లేదండీ..." ఆమె గొంతు బొంగురుపోయింది. ఉలిక్కిపడ్డాడు రామయ్య. "ఏమైంది జానకీ... బాగా నొప్పుందా... అమృతాంజనం రాయనా?"



హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలో ఇందూరు భారతి, మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సభలో 'సూర్యుని ఏడో గుర్రం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో రఘుశ్రీ, చెన్నకేశవరెడ్డి, గ్రంథకర్త సూర్యప్రకాష్, కె. శ్రీనివాస్, డా॥ కె. శివారెడ్డి, డాక్టర్ రావూరి భరద్వాజ, దీక్షితులు ఉన్నారు.

"వద్దండీ..." జానకి ఏడుపు ఆగలేదు.

"జానకీ... ఎందుకలా?..."

"నేను... నేను... చాలా దురదృష్టవంతురాలి నండి... మన బాబు పెళ్లిముచ్చట్లు చూసి ఆనందించలేదు... కోడలితో ప్రేమానురాగాలు పంచుకోలేదు... కనీసం ఒక బామ్మగా చిన్నదాన్ని కాళ్లమధ్య పడుకోబెట్టుకుని స్నానం చేయించలేదు... ఆ చిన్నారి బోసినవ్వులు చూడలేదు... గోరుముద్దలు తినిపించలేదు... బుజ్జిబుజ్జి అడుగులేస్తుంటే చూడలేదు... లాలించలేదు... ఒక్క జోలపాట పాడలేదు... ఇంకేమి సరదాలండీ... చిన్నారి పాపని ఒళ్లో ఎత్తుకు బుజ్జగించే అదృష్టం కూడా నాకు దక్కలేదు..." వెక్కి వెక్కి ఏడవసాగింది జానకి.

రామయ్యకి కూడా కళ్లలో గిర్రున నీరు తిరిగింది.

"ఛ... ఏమిటి జానకీ మరీ అలా పసిపాపలా... ఊరుకో... రేపు వస్తున్నారుకదా. రవికి చెప్తాను... పాపని కొన్నాళ్లు ఇక్కడ వుంచమని... ఊరుకో..." అని వణుకుతున్న చేతులతో జానకి వీపుమీద నిమిరాడు.

"నాకు తెలుసండీ... మీరు చెప్పరుకానీ... నా కన్నా ఎక్కువ బాధ మీరు లోలోన భరిస్తున్నారు."

"ఊరుకో జానకీ... మరేం బాధపడకు... కళ్లుమూసుకుని పడుకో... ఇంకాసేపట్లో తెల్లవారిపోతుంది" అని ఆమె తల ప్రేమగా నిమురుతూ రామయ్య తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాడు.

* * *

డోర్‌బెల్ మ్రోగింది!

రామయ్య ఉలిక్కిపడి లేచాడు. కళ్లద్దాలు పెట్టుకుని గడియారం చూసాడు... ఏడున్నర! బాగా తెల్లారిపోయింది. ప్రక్కనే జానకి గాఢ నిద్రలో ఉంది.

'పాపం... అమాయకురాలు... రాత్రంతా జాగారం చేసి యిప్పుడే కునుకు పట్టినట్లుంది... లేకపోతే ప్రతిరోజూ అయిదు గంటలకే లేచేది.'

అంతలోనే మళ్లా డోర్‌బెల్ మ్రోగింది.

'వాళ్లు వచ్చేసినట్లున్నారు,' అని హడావిడిగా వెళ్లితలుపు తీసాడు. ఎదురుగా రవి మిత్రుడు.

"అంకుల్... రవికి అర్జెంట్ పన్లుండి రావడంలేదని రాత్రి మెసేజ్ పంపాడు... మళ్లా సమయం చూసుకొని మీతో మాట్లాడతానన్నాడు... వస్తా అంకుల్...!"

రామయ్య శరీరంలో నరాలు మంచుగడ్డలా అయినట్లనిపించింది. బిత్తరచూపులతో వెళ్లిపోతున్న రవి మిత్రుడిని అలానే చూస్తూ ఉండిపోయాడు. ఎలాగో ధైర్యం చేసుకుని గట్టిగా ఊపిరి పీల్చుకుని తలుపువేసి జానకిని లేపి మెల్లిగా ఈ వార్త చెప్పాలని ఆమె వద్దకు వచ్చాడు.

చిన్నారిపాపలా జానకి గాఢనిద్రలోనే ఉంది.

"జానకీ... జానకీ..." మెల్లిగా ఆమెతల నిమిరాడు.

అంతే!

రామయ్య స్తబ్దుడయ్యాడు. భూమి గుండ్రంగా తిరుగుతున్నట్లయింది.

'ఆ విషయం తనకి రాత్రే తెలుసన్నట్లు' జానకి తల ఓవైపుకు వాల్చేసింది. ●